క్లుప్తంగా

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం



ప్రతిజ్ఞచేస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్, అంగన్‌వాడీ టీచర్లు, కిశోరబాలికలు

పామూరు: కిశోర బాలికలు సంపూర్ణ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను నియంత్రించుకోవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోర్ల పద్మజ అన్నారు. పామూరు డీపీ పాలెం అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర వికాసం కార్యక్రమం నిర్వహించి కిశోరబాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యంపై సూచనలు చేశారు. బాలింతలు పిల్లలు పుట్టిన 21 రోజుల్లోగా జనన ధ్రువీకరణ పత్రం విధిగా పొంది తద్వారా ఆధార్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. దీంతో పిల్లలకు ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని పథకాలు, సేవలు అందుతాయన్నారు. రామసుబ్బులు, రాజేశ్వరి, ఆశాలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

కొండపి: మండల సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామాంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు. మండలస్థాయి అధికారులు ఆయా శాఖల పూర్తి నివేదికతో హాజరు కావాలన్నారు.

ఆయుర్వేద వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులు దూరం



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ పుండరీ కాక్షరావు

సీఎస్‌పురం(పామూరు): ఆయుర్వేద వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులు దూరం చేయవచ్చని అరివేముల ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ పుండరీకాక్షరావు అన్నారు. స్థానిక వైద్యశాలలో శుక్రవారం ఆయుర్వేద వైద్యం ప్రాముఖ్యతపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం, వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీచేశారు. అనంతరం యోగా ఇన్‌స్ట్రక్టర్ షేక్.ఖాజాదావూద్ యోగాసనాలు చేయించారు. ఫార్మసిస్ట్ మంజూర్ అహమ్మద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

విత్తనాభివృద్ధి క్షేత్రం భూముల పరిశీలన

లింగసముద్రం: మండలంలోని చినపవని గ్రామ సమీపంలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ పరిశోధన అనుబంధ విత్తనాభివృద్ధి క్షేత్రం భూములను కందుకూరు సబ్‌కలెక్టర్ తిరుమణి శ్రీపూజ శుక్రవారం పరిశీలించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో విత్తనాభివృద్ధి క్షేత్రానికి సంబంధించి 410 ఎకరాలు కేటాయించారు. అప్పటి నుంచి విత్తనాభివృద్ధి క్షేత్రంలో ఎన్ని రకాల పంటలు సాగు చేశారో అధికారులను అడిగారు. ఈ భూముల్లో నువ్వులు, మినుములు, పెసర, జొన్న పంటలను సాగు చేసి మేలైన వంగడాలను ఉత్పత్తి చేస్తున్నట్లు సబ్ కలెక్టర్‌కు వివరించారు. విత్తనాభివృద్ధి క్షేత్రంలో గోడౌన్లు ఎన్ని నిర్మించారు, ఏ ఏ పనులు చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. మూడు గోడౌన్లు నిర్మాణంలో చివరి దశలో ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ ఎం శ్రీనివాసులు, సర్వేయర్లు గోపిరెడ్డి, మన్విత్ సాయి, వీఆర్వోలు మస్తాన్‌వలి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు గేదె మృతి

గుడ్లూరు: మండలంలోని గుండ్లపాలెం గ్రామానికి చెందిన బచ్చు సుధాకర్ గేదె పిడుగుపడి మృతి చెందింది. గేదె విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని బాధితుడు వాపోయాడు

కంపు కొడుతున్న కనిగిరి



రోడ్లపై కంపు లేస్తున్న చెత్తను ట్రాక్టర్లకు ఎత్తుతున్న మున్సిపల్ కార్మికులు



డస్ట్‌బిన్‌లలో నిండిన చెత్త

- మరమ్మతులకు గురైన కాంపాక్టర్ వాహనం
- ప్రధాన వీధుల్లో ఎక్కడ చూసినా చెత్తే
- దుర్గంధంతో అల్లాడుతున్న ప్రజలు..
- పట్టించుకోని అధికారులు

కనిగిరిరూరల్:

అధ్వాన పారిశుధ్యంతో కనిగిరి కంపు కొడుతోంది. కనిగిరిలోని ప్రధాన సెంటర్లు, వీధులు చెత్తతో నిండిపోయాయి. వివరాల్లోకి వెలితే కనిగిరి మున్సిపాలిటీలో సుమారు 20వార్డులు ఉండగా.. 50 వేలకు పైగా జనాభా ఉన్నారు. నిత్యం 20 వార్డుల నుంచి సుమారు 14 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుంది. అయితే చెత్తను తరలించే తీసుకెళ్లే కంపాక్టర్ వాహనం గత 20 రోజుల నుంచి నిలిచిపోయింది. దీంతో కనిగిరిలోని ప్రధాన వీధులన్నీ చెత్త మయంగా మారాయి. ప్రధాన రోడ్లు, వీధులు చెత్త మయంగా మారి దుర్గంధం వెదజల్లుతున్నాయి.

ప్రజారోగ్యంపై మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం

ఆదాయ వనరులపై దృష్టి సారించే మున్సిపల్ అధికారులు, ప్రజారోగ్యంపై దృష్టి సారించడం లేదు. శరవేగంగా పెరుగుతున్న మున్సిపాలిటీలో అందుకు తగిన పరికరాలు లేవు. డివిజన్ కేంద్రం, నియోజకవర్గ కేంద్రంగా ఉన్నా.. కనిగిరి మున్సిపాలిటీకి కేవలం ఒక కంపాక్టర్ మాత్రమే ఉండగా.. నాల్గు చెత్త ట్రాక్టర్లు ఉన్నాయి. కంపాక్టర్ వాహనం మరమ్మతులకు గురై 20 రోజులు దాటినా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టే పరిస్థితులు లేవు.

నగదు చెల్లించకపోవడంతోనే..

వాహనం 20 రోజుల క్రితం మరమ్మతులకు గురైంది. దీంతో విజయవాడ తరలించారు. అయితే మరమ్మతులు పూర్తయినా అందుకు నగదు చెల్లించకపోవడంతో విజయవాడలోని షెడ్‌లో నిలిచినట్లు సమాచారం. 16వ ఆర్థిక సంఘ నిధుల కింద మరో పెద్ద కంపాక్టర్, మరో నాల్గు చెత్త ట్రాక్టర్లు ట్రాలీలు ప్రతిపాదనలు పంపినట్లు చెప్పున్న అధికారులు. ఉన్న వాటిని మరమ్మతులు చేయించకపోవడం దారుణం. ఉన్న నాల్గు ట్రాక్టర్లతో రోడ్లపైకి విస్తరంగా వచ్చిన ఉన్న ప్రధాన సెంటర్లలోని చెత్తను పారిశుధ్య కార్మికులు ఎత్తి మమ అనిపించారు. పన్నులను ముక్కు పిండి వసూలు చేస్తున్న మున్సిపల్ అధికారులు కనీసం ప్రజా ఆరోగ్యం పై స్పందిచక పోవడం పట్ల పట్టణ ప్రజలు ఛీదరించుకుంటున్నారు.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం



ర్యాలీని ప్రారంభిస్తున్న చైర్మన్ గఫార్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సృజన



హెచ్‌ఎంపాడులో అవగాహన ర్యాలీ

కనిగిరిరూరల్: పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దరిచేరవని మున్సిపల్ మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, డిప్యూటీ డీఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ ఏ సృజన అన్నారు. మలేరియా సబ్ యూనిట్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవ ర్యాలీ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మలేరియా సబ్ యూనిట్ అధికారి రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చైర్మన్ గఫార్ మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలని, దోమలవ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఏ సృజన మాట్లాడుతూ అకస్మికంగా తీవ్రమైన జ్వరం, తల నొప్పి కండరాలు కొప్పి, కీళ్ల నొప్పులు, శరీరంగా ఎర్రటి దద్దుర్లు చిగుళ్ల నుంచి రక్తస్రావం, అధిక దాహం వంటి లక్షణాలు వచ్చిన వెంటనే ఆస్పత్రికి వెళ్లాలన్నారు. ఎస్‌టీఎస్ బాబురావు, వివిధ సంస్థల ప్రతినిధులు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సింగరాయకొండ: డెంగీపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ వైద్యాధికారి వంశీధర్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ వంశీధర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి కందుకూరు రోడ్డు సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య పర్యవేక్షకుడు సయ్యద్ మసూద్‌ఆలీ, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మర్రిపూడి: ఇంటి పరిసరాల్లో నీరు నిలబడకుండా చూసుకోవాలని కాకర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి సాయి రుచిత తెలిపారు. మండలంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో డెంగీ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య విస్తరణాధికారి ఏడుకొండలు, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీకాంత్, శ్రీనివాసకుమారి, వీరాంజనేయులు, శ్రీనివాసరావు పాల్గన్నారు.

కొండపి: పరిసరాల పరిశుభ్రతతోనే మంచి ఆరోగ్యం సాధ్యమని ప్రైమరీ హెల్త్ సెంటర్ సిబ్బంది అన్నారు. మండలంలోని పెట్లూరు ప్రైమరీ హెల్త్ సెంటర్ సిబ్బంది ఆధ్వర్యంలో జాతీయ డెంగీ దినోత్సవ సందర్భంగా డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు.

హనుమంతునిపాడు: జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా మెడికల్ ఆఫీసర్ల దార్ల సందీప్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సీహెచ్‌ఓ కేవీ చెన్నయ్య, సూపర్ వైజర్లు, బాలుడు, పద్మావతి, ఏఎన్‌ఎంలు, నర్సులు పాల్గొన్నారు.



సింగరాయకొండలో అవగాహన ర్యాలీ



కాకర్లలో డెంగీపై అవగాహన ర్యాలీ



కొండపిలో అవగాహన కార్యక్రమం

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



గంగమ్మ తల్లికి పూజలు నిర్వహిస్తున్న దద్దాల



కాటంరాజు విగ్రహం వద్ద దద్దాల, నేతలు



కాటంరాజు విగ్రహానికి పూజలు చేస్తున్న బుర్రా

పీసీపల్లి: మండల పరిధిలోని వెంగళాపురం సమీపంలో పాలేటి నది ఒడ్డున వెలసిన గంగమ్మ తల్లి తిరునాళ్ల సందర్భంగా వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కాటమరాజు విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట గోపవరపు బొర్రారెడ్డి, పెద్దిరెడ్డి ఓకే రెడ్డి, పోలు జయరామి రెడ్డి, మడతల కస్తూరిరెడ్డి, ఆవుల భాస్కర్ రెడ్డి, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, పరిమి వెంకట్రావు చౌదరి, రేగుల బాలయ్య, గుదే నాగేశ్వరావు, పరిమి వెంకటేశ్వర్లు, గుదే రమణయ్య, మూలే రాజశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ భూమిరెడ్డి కొండారెడ్డి, యర్రంరెడ్డి మోహన్‌రెడ్డి, ఎల్‌డీ నరసింహ రెడ్డి, మడతల ఓబుళ రెడ్డి, బద్దెల వేణుగోపాల్ రెడ్డి,నరాల కొండారెడ్డి, పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కందుకూరు ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ పాలేటి గంగమ్మకు, కాటమరాజు విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. రంగనాయకుల రెడ్డి, పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు ప్రారంభం



పూజల్లో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని బాలుపల్లిలో నూతనంగా నిర్మించిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్ల విగ్రహ ప్రతిష్టా మహోత్సవం రుత్వికుల వేద మంత్రాల నడుమ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా దేవతా మూర్తుల మూల విగ్రహమూర్తులకు జలాదివాసం, ధాన్యాదివాసం, విశిష్ట పూజలు నిర్వహించారు. ప్రతిష్టా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ పామూరు మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, రాష్ట్ర గ్రీవెన్స్‌సెల్ సెక్రటరీ గట్లా విజయభాస్కర్‌రెడ్డి, సీనియర్ నాయకులు జొన్నలగడ్డ గోవిందయ్య, ఎస్టీసెల్ అధ్యక్షుడు శ్రీరాం శ్రీనివాసులు, మండల ఉపాధ్యక్షుడు ఎలికా అచ్చయ్య, మితికాల బాలకృష్ణ, సర్పంచ్ బొట్లా చిరంజీవి, గోగుల బాలయ్య, ఎలియేజర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మార్కెట్‌కి అనుగుణంగా బేళ్లను తీసుకురావాలి



రైతులతో మాట్లాడుతున్న ఆర్‌ఎం లక్ష్మణరావు



కొండపిలో వేలం నిర్వహిస్తున్న నిర్వహణాధికారి సునీల్ కుమార్



వేలం నిర్వహిస్తున్న అధికారులు

కొండపి: మార్కెట్‌కి అనుగుణంగా పొగాకు బేళ్లను తీసుకురావాలని రీజనల్ మేనేజర్ లక్ష్మణరావు అన్నారు. స్థానిక వేలం కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ మార్కెట్ దృష్ట్యా రైతులు తేమ, వేడి లాంటివి లేకుండా చూసుకోవాలన్నారు. రైతులు ఒకరోజు ముందే వేలం కేంద్రానికి వచ్చి వేలాన్ని పరిశీలించి దాని ప్రకారం బేళ్లను తీసుకొని రావాలన్నారు. బేళ్లలో అన్య పదార్థాలు కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వేలం నిర్వహణ అధికారి జి. సునీల్‌కుమార్, బోర్డు సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

కొండపి: స్థానిక వేలం కేంద్రం నిర్వహించిన వేలంలో 281 బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. క్లస్టర్ పరిధిలోని కట్టవారిపాలెం, నర్సింగోలు చెందిన రైతులు వేలానికి 1177 బేళ్లను తీసుకురాగా 896 బేళ్లను కొనుగోలు చేశారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.210, సరాసరి ధర రూ.252 పలికింది. వేలంలో 18 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. వేలాన్ని రీజనల్ మేనేజర్ లక్ష్మణరావు పరిశీలించారు.

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో నిర్వహించిన వేలంలో పొగాకు సరాసరి ధర కేజీ రూ.244.75 పలికిందని వేలం నిర్వహణ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. క్లస్టర్ పరిధిలోని చిరికూరపాడు, పంగులూరివారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు వేలానికి 970 బేళ్లనుతీసుకురాగా 714 బేళ్లను కొనుగోలు చేసి 256 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.205గా నమోదైంది. వేలంలో 14 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కనిగిరిరూరల్: కనిగిరి వేలంకేంద్రానికి పామూరు క్లస్టర్ పరిధిలోని వివిధ గ్రామాల పరిధిలోని రైతులు 469 పొగాకు బేళ్లను తీసుకుని వచ్చారు. వ్యాపారులు 346 బేళ్లను కొనుగోలు చేసి 120 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.200 పలికింది. వేలంలో 11 కంపెనీల వ్యాపారులు పాల్గొన్నారు.

సెల్‌టవర్ నిర్మాణ పనుల అడ్డగింత



సెల్‌టవర్ నిర్మాణం వద్ద నిరసన తెలుపుతున్న పరిసరప్రాంత ప్రజలు

పామూరు: స్థానిక నెల్లూరు రోడ్డులోని చైతన్యస్కూల్ వెనుక ప్రాంతంలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న సెల్‌టవర్ నిర్మాణ పనులను శుక్రవారం సమీప ప్రజలు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ వారు నోటీస్‌ఇచ్చి టవర్ పనులు ఆపమన్నా రాత్రి వేళల్లో టవర్ పనులు కొనసాగిస్తున్నారన్నారు. సమీపంలో పాఠశాల, నివాస గృహాలు ఉన్నాయని టవర్ నిర్మాణం చేయడం ద్వారా రేడియేషన్ వచ్చి పిల్లలకు మైగ్రేన్, క్యాన్సర్ వంటి వ్యాధుల పాలయ్యే ప్రమాదం ఉందన్నారు. తక్షణం సెల్ టవర్ పనులు ఆపాలని కోరుతూ శ్రీనగర్‌వాసులు ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య, ఈఓపీఆర్‌డీ అరవింద రెడ్డి, తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాలు అందజేశారు. యు.హరిబాబు, బండ్లా నారాయణ, పలువురు శ్రీనగర్‌వాసులు పాల్గొన్నారు.

లీజుకు ఆర్టీసీ బస్టాండ్‌లోని స్థలాలు



ఆర్టీసీ బస్టాండ్‌లో ఖాళీస్థలాన్ని పరిశీలిస్తున్న డీఎం

పామూరు: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లోని రెండు స్థలాలు 15 ఏళ్ల కాలానికి అద్దె ప్రాతిపదికన ఇచ్చేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు కనిగిరి ఆర్టీసీ డీఎం మహ్మద్ సయానాబేగం తెలిపారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో అద్దెకు ఇవ్వనున్న స్థలాలను శుక్రవారం డీయం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సంద్భంగా డీఎం మాట్లాడుతూ చట్టపరమైన వ్యాపారం చేసుకునేందుకు ఔత్సాహికులు ఇందుకోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. వీ టికోసం 29వ తేదీ ఉదయం 10.30 గంటలలోగా నెల్లూరు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యాలయంలో దాఖలుచేయాలన్నారు. టెండర్ 29వ తేదీ సాయంత్రం 3 గంటలకు ఓపెన్ చేస్తామన్నారు. దీనిపై ఈనెల 22వ తేదీ ఉదయం 10.30 గంటలకు ఒంగోలులోని డీపీటీఓ కార్యాలయంలో అవగాహన సదస్సు ఉంటుందన్నారు. వివరాలకు 9154291402, 9959225701 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పలువురు వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు పరామర్శ

కందుకూరు: పట్టణంలోని పలువురు వైఎస్సార్ సీపీ కార్యకర్తల కుటుంబాలను పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త బుర్రా మధుసూదన్‌యాదవ్ శుక్రవారం పరామర్శించారు. వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ విభాగం అధ్యక్షుడు ఉచ్చులూరి రవీంద్ర తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా రవీంద్ర ఇంటికి వెళ్లిన బుర్రా ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. పట్టణానికి చెందిన మరో కార్యకర్త దండే రమేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఆయన వద్దకు వెళ్లిన బుర్రా రమేష్‌ను పరామర్శించి, ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం కుదుటపడే వరకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వచ్చి వారం రోజులైనా..!

- పారిశుధ్య సామగ్రి పంపిణీకి 'ముహూర్తం ఎప్పుడో'... ?
- పారిశుధ్య కార్మికులకు అందచేయని వైనం
- పొంగి పొర్లుతున్న చెత్త డబ్బాలు

కనిగిరిరూరల్: పట్టణ పరిశుభ్రత, స్వచ్ఛంద్రా తదితర కార్యక్రమాల పేరుతో ఊకదంపుడు ప్రసంగాలు.. ప్రచార కార్యక్రమాలతో మమ అనిపించే అధికారులు, ప్రజాప్రతినిధులు.. వాటి నిర్వాహణ చర్యల్లో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వివరాల్లోకి వెళితే 15వ ఆర్థిక సంఘ నిధులు సుమారు రూ.6 లక్షలతో ప్రతిపాదనలు చేసిన పుష్కాట్ బండ్లు, చెత్త తొట్లు చాల రోజులకు మున్సిపల్ ఆఫీసుకు చేరాయి. సుమారు 23 చెత్త కుండీల తొట్లు, 16 వరకు పుష్కాట్ తోపుడు బండ్లు ఆఫీసుకు వారం రోజుల క్రితం వచ్చాయి. అయితే వాటిని ఇప్పటి వరకు మున్సిపల్ అధికారులకు కార్మికులకు పంపిణీ చేయలేదు. అసలే చెత్త కాంపాక్టర్ వాహనం చెడిపోయి నెల రోజులు కావడం, రోడ్లపై చెత్త ఎక్కడికక్కడ నిండిపోవడంతో దుర్గంధం వెదజల్లుతూ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా వాటిని పారిశుధ్య కార్మికులకు ఇవ్వకపోవడంపై ఇటు కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు, ప్రజలు తీవ్రంగా మండిపడుతున్నారు.



మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య సామగ్రి



సామగ్రి దించుతున్న దృశ్యం

47.80 మి.మీ వర్షపాతం నమోదు



కూరగాయల మార్కెట్ సెంటర్‌లో రోడ్డు పై నిలిచిన వర్షం నీరు



శాంతిథియేటర్ సమీపంలో రోడ్డు పై నిలిచిన వర్షం నీరు

సింగరాయకొండ: మండలంలో 47.80 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ టి. రవి తెలిపారు. తెల్లవారుజామున సుమారు 5 గంటల నుంచి 9 గంటల వరకు ఎడతెరిపి లేకుండా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఊళ్లపాలెం గ్రామంలోని బేసిన్ పల్లెపాలెంలో ఉన్న రామాలయం గోపురంపై పిడుగుపడటంతో గోపురం పాక్షికంగా దెబ్బతింది. వర్షం కారణంగా మండల కేంద్రంలోని మెయిన్‌రోడ్డుపై నీరు నిలవడంతో పాదచారులు ఇబ్బందులు పడ్డారు. మెయిన్‌రోడ్డుపై గుంతలు పూడ్చడానికి ప్రాధాన్యత ఇచ్చారే తప్ప రోడ్డుపై పడ్డ వర్షం నీరు పోయేలా చర్యలు తీసుకోకపోవటంతో నీరు రోడ్డుపై నిలిచి మార్జిన్లు గుంతలమయంగా మారాయి.

కొండపి: మండలంలో శుక్రవారం తెల్లవారుజామున ఉరుములు మెరుపులతో కూడిన మోస్తారు వర్షం కురిసింది. భానుడి ప్రతాపంతో అల్లాడుతున్న ప్రజలు తెల్లవారుజామున కురిసిన వర్షానికి కొంత ఊపిరి పీల్చుకున్నారు. కురిసిన కొద్దిపాటి వర్షానికి తెల్లవారుజామున 2:30 నుంచి ఉదయం 9 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో చిన్నపిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడ్డారు. పంచాయతీలోని కట్టవారిపాలెంలో ఒక ఇంటి పై కప్పు చివరన పిడుగు పడడంతో గోడ చివరి అంచు పాక్షికంగా దెబ్బతింది. ఆ ఇంట్లోని విద్యుత్ వైర్లు కాలిపోయాయి. విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడింది.